మధ్యాహ్న భోజన కార్మికులకు శిక్షణ

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లి మండలంలో స్థానిక ఎఎస్ఎన్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మిడ్డే మీల్స్ పథకం నిర్వాహకులకు ఒకరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణా తరగతుల్లో 45 పాఠశాలల నుండి 93 మంది కుక్ కం హెల్పర్స్, సిసిహెచ్ నిర్వాహకులు హాజరయ్యారు. మెనూలోని వివిధ అంశాల గురించి తెలుసుకుంటూ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంలో పోషకాహారం ఏ రకంగా అందించాలి, ఇప్పటి కంటే మెరుగ్గా ఏ విధంగా పదార్థాలను తయారు చేయాలి, అనే అంశాల మీద శిక్షణ నిర్వహించారు. రిసోర్స్ పర్సన్ ఎ.పద్మావతి, నారాయణ, ఎడి వెంకట రాజు, జూనియర్ సహాయకులు శ్రీనివాసు, అచ్యుత్, ఎంఇఒలు మాణిక్యం తిరుమల దాసు, కెఆర్ఎస్‌వివి.అప్పారావు, పాఠశాల హెచ్ఎం బి.శ్రీలక్ష్మి, హెచ్ఎం రవీంద్రనాథ్ పాల్గొన్నారు

అప్రకటిత విద్యుత్ కోతలు

- ఎండలతో పెరిగిన విద్యుత్ వాడకం
- ఉమ్మడి జిల్లాలో 4 మిలియన్ యూనిట పెంపు
- రోజుకు 20 మిలియన్ యూనిట్లకుపైగా వినియోగం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలో అనధికార విద్యుత్ కోతలు అమలవుతున్నాయి. పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో విద్యుత్ వినియోగం పెరిగింది. అందుకు అనుగుణంగా కేటాయింపులు లేకపోవడంతో విద్యుత సరఫరాలో సమస్యలు తలెత్తుతున్నట్లు ఆయా వర్గాల సమాచారం. ఈ క్రమంలోనే అనధికారికంగా కోతలు అమలవుతున్నాయి. దీంతో ఉక్కపోత, ఉమ్మదీతలతో వినియోగదారులకు ఇబ్బందులు తప్పటం లేదు. సరఫరాలో అంతరాయాలకు సాంకేతిక సమస్యలే కారణమని, ఆ సమస్యలను త్వరిత గతిన పరిష్కరించి సరఫరా పునరుద్ధరిస్తామని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లాలో రోజువారీగా విద్యుత వినియోగం 20 మిలియన యూనిట్లకు పైగానే ఉంటోంది. కేటాయింపులు మాత్రం 19మిలియన యూనిట్లుగా ఉంది. ఫలితంగా విద్యుత్ అంతరాయాల సమస్య తలెత్తుతోంది. అప్రకటిత కోతలు కారణంగా ప్రజల ఇబ్బందులు పడుతున్నారు.



జిల్లా వ్యాప్తంగా పెరిగిన వినియోగం

ఉమ్మడి జిల్లాలో 19.16లక్షల విద్యుత కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో గహాలకు 16.23 లక్షల గహాల కనెక్షన్లు ఉన్నాయి. వీటితోపాటు, వాణిజ్యం, పరిశ్రమలు, తాగునీటి కనెక్షన్లు, వీధిలైట్లు తదితర కనెక్షన్లు 3.07 లక్షలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం రోజువారిగా 20 మిలియన యూనిట్ల విద్యుత వినియోగం జరుగుతోంది. ఫిబ్రవరి నెలలో 16 నుంచి 17 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరిగింది. మార్చిలో 17 నుంచి 18 యూనిట్ల మధ్య వినియోగం జరిగింది. తాజాగా మే నెలలో 19 మిలియన్ యూనిట్ల నుంచి 20 మిలియన్ యూనిట్లకు పెరిగింది. గడిచిన మూడు నెలల్లో సరాసరి నాలుగు వేల మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం ఒక్కసారిగా పెరిగినట్లు అధికారులు గణాంకాలు చెప్తున్నాయి. . సాధారణంగా ఎండాకాలంలో విద్యుత కేటాయింపులు కొంత ఎక్కువగానే ఉండాలి. అయితే వేసవి కాలంలో సాగు విస్తీర్ణం తగ్గుతుందన్న నెపంతో కేటాయింపులు తగ్గించినట్లు ఆయా వర్గాల ద్వారా తెలుస్తోంది.

కోతలు షురూ...

జిల్లాలో విద్యుత్ వినియోగం కంటే కేటాయింపులు తక్కువగా ఉండటంతో ఇటు గహాలకు..అటు వ్యవసాయానికి సరఫరా అయ్యే విద్యుతలో కోతలు పడుతున్నాయి. వ్యవసాయాకి రెండు విడతలో 9గంటల విద్యుత సరఫరా చేయాల్సి ఉండగా.. సరాసరిన అర గంట నుంచి గంట సమయం వివిధ సాకుల పేరుతో కోత పెడుతున్నట్లు రైతులు చెబుతున్నారు. దీనికి తోడు కరెంటు ఎప్పుడు వస్తుందో..ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితుల్లో రైతులు పడిపోయారు. ఇక గహాలకు సంబంధించి అనధికారికంగానే కోతలు అమలు అవుతున్నాయి. జిల్లా కేంద్రాలలో సైతం విద్యుత్ కోతలు పరిపాటిగామారాయి. దీంతో వినియోగదారులు కరెంటు కష్టాలు తప్పడం లేదు. డిమాండ్‌కు తగ్గట్లుగా సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలని వినియోగదారులు కోరుతున్నారు. అయితే వేసవి నేపథ్యంలో జిల్లాలో విద్యుత్ వినియోగం పెరిగిందని అదికారికంగా విద్యుత్ కోతలు లేవని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు.

కౌంటింగ్ విధులపై కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

కౌంటింగ్ ప్రక్రియ, అధికారుల విధులు బాధ్యతలపై మంగళవారం కలక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాధవీలత సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సార్వత్రిక ఎన్నికల ఫలితాల ప్రకటన కీలక దశకు చేరుకున్నట్టు తెలిపారు. ఇందు కోసం ప్రత్యేకంగా దృష్టి పెట్టి ఎవరూ ఏయే విధులు నిర్వహించాలనే క్రమంలో ఉత్తర్వులు జారీ చేశామన్నారు. ఇప్పటి వరకు ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో విధులను నిర్వర్తించడం అభినందనీయం అన్నారు. అదే తీరును కౌంటింగ్ సందర్భంలో కూడా నిర్వర్తించాలని స్పష్టం చేశారు.

ముందుగా పోస్టల్ బ్యాలెట్‌పై చేపట్టవలసిన వాటిపై అవగాహన కల్పించారు. పరిపాలన భవనం రెండో అంతస్తులో పోస్టల్ బ్యాలెట్, ఇటిపిబిఎస్ ఓట్ల లెక్కింపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 50 చొప్పున పోస్టల్ బ్యాలెట్ బండిల్స్ ఏర్పాటు, 14 ప్లస్ 4 టేబుల్స్ ద్వారా అభ్యర్థుల వారీగా లెక్కింపు, తిరస్కరించిన పోస్టల్ బ్యాలెట్ ఓట్లు సీలింగ్ వరకూ ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. కౌంటింగ్ సిబ్బంది హాజరు నమోదు, గుర్తింపు కార్డులు జారీ, ఇతర అనుబంధ ఏర్పాట్లు, నివేదికలు, రౌండ్ వారీగా ఫలితాల ప్రకటన కోసం ఎవరు ఏ విధులు చేపట్టలో సమగ్రంగా ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు మాధవీలత తెలియ చేశారు. ఇవిఎం యూనిట్స్‌లో పోలైన ఓట్లు లెక్కింపు కోసం నిర్దిష్టమైన కార్యచరణ, ఆయా నియోజకవర్గ రిటర్నింగ్ అధికారుల ద్వారా విధులను కేటాయించినట్టు తెలిపారు. విధులను నిర్వర్తించడంలో భాగంగా ఆయా శాఖల అధికారులు వారి సిబ్బందితో కూడి ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కౌంటింగ్ ప్రక్రియలో భాగస్వామ్యం అయ్యే ప్రతి ఒక్కరికీ ఎటువంటి ఇబ్బందులూ లేకుండా సజావుగా సాగేందుకు జిల్లా ఎన్నికల అధికారి తరపున చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ మాధవీలత తెలిపారు. జూన్ 4వ తేదీ కౌంటింగ్ నేపథ్యంలో జూన్ 2వ తేదీన ట్రైల్ రన్ ఉదయం 9 గంటల నుంచి నిర్వహిస్తామని, సిబ్బంది అందరూ తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి, దివాన్ చెరువు వద్ద బస్సులు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. నన్నయ యూనివర్సిటీలో రెండు అంబులెన్స్‌లు, ప్రతి కౌంటింగ్ హాల్స్ వద్ద మెడికల్ టీమ్, జిఎస్ఎల్ వారితో అత్యవసర వైద్య సేవల కోసం సమన్వయం చేసుకోవాలని డిఎంహెచ్ఒకు తెలిపారు. విద్యుత్ సరఫరాలో ఆటంకాలు లేకుండా ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ, తాగునీటి వ్యవస్థ కోసం ఏర్పాట్లను డ్వామా పీడీ పర్యవేక్షించాలన్నారు. యూనివర్శిటీ క్యాంపస్ ప్రధాన మార్గంలో కౌంటింగ్ సిబ్బంది, అభ్యర్థులు, ఏజెంట్స్ గుర్తించి, ఇందుకు జారీ చేసిన గుర్తింపు కార్డులు ఉన్న వారిని అనుమతించాలని స్పష్టం చేశారు. ఇందుకోసం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ హోదా అధికారిని నియమించినట్టు తెలిపారు. అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్స్, కౌంటింగ్ సిబ్బందిని కౌంటింగ్ కేంద్రంలోకి తీసుకుని రావడం కోసం దివాన్ చెరువు తదితర ప్రాంతాల్లో పార్కింగ్ స్థలంలో బస్సులు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. శానిటేషన్ నిర్వహణా వ్యవస్థ జిల్లా గ్రామ పంచాయతీ అధికారి ఆధ్వర్యంలో ఏర్పాటు చెయ్యాలని మాధవీలత తెలిపారు. మొత్తం అన్ని విభాగాల అధికారులు, శాఖలతో జిల్లా రెవెన్యూ అధికారి సమన్వయం సాధిస్తారని తెలిపారు.

కౌంటింగ్ కేంద్రాల వద్ద మెడికల్ క్యాంప్

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ఎన్నికల కౌంటింగ్ వద్ద వైద్య శిబిరం నిర్వహణపై వైద్యులు, వైద్య సిబ్బందితో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గం కౌంటింగ్ చేసే బిల్డింగ్ వద్ద ఒక మెడికల్ క్యాంపును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఏడు నియోజకవర్గాల్లోని కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏడు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రెండు మెడికల్ సపోర్టింగ్ ఎమర్జెన్సీ రూమ్స్ ఏర్పాటు చేసి ఇద్దరు మెడికల్ ఆఫీసర్లను అందుబాటులో ఉంచుతామన్నారు. జిఎస్ఎల్ మెడికల్ కాలేజీలో స్పెషలిస్ట్ డాక్టర్స్ బృందంతో కూడిన రెండు మెడికల్ సేఫ్ రూమ్స్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కౌంటింగ్ జరిగే యూనివర్సిటీ ప్రాంగణంలో నాలుగు అంబులెన్స్ సర్వీసెస్ ఏర్పాటు చేశామన్నారు. మెడికల్ క్యాంపులకు వచ్చే సిబ్బంది వారి వారి ఐడెంటి కార్డులతో ఉదయం ఐదు గంటలకు యూనివర్సిటీ ప్రాంగణానికి వెళ్లాలన్నారు. కౌంటింగ్ అయ్యేంతవరకు సేవలందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు జాన్సన్ రాజు, బి.రాజు, శ్రీనివాస్, సురేష్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

ఆసరా సొమ్ము అక్రమాలపై విచారణ

ప్రజాశక్తి-పెరవలి

మండలంలోని కానూరులో ఆసరా పథకం నిధులు దుర్వినియోగంపై డిఆర్‌డిఎ పీడీ మూర్తి ఆదేశాల ఎపిఎం త్రిమూర్తులు, డిపిఎం రాజబాబు ఆధ్వర్యంలో స్థానిక లేసు భవనంలో మంగళవారం విచారణ చేసి సంబంధిత రికార్డులను పరిశీలించారు. అనంతరం యూనియన్ బ్యాంకు బ్రాంచ్‌కు వెళ్లి ఆసరా పథకం సొమ్ము ఏ ఖాతాల్లోకి వెళ్ళిందీ పరిశీలించారు. ఆరు గ్రూపుల్లో 14 మంది సభ్యులకు రూ.1,40,000 నగదును విఒఎ నుంచి రికవరీ చేసి బాధితుల పొదుపు ఖాతాల్లో జమ చేశారు. బాధిత మహిళలు గ్రామ సంఘం నాయకులు అధికారులతో చర్చించారు.

విచారణ చేస్తున్న డిఎస్‌పి శ్రీనివాసులు

అధికారులపై దాడి ఘటనపై విచారణ

ప్రజాశక్తి - సీతానగరం

దళిత అధికారులపై ఇసుకాసురుల దాడి ఘటనపై మంగళవారం ఎస్‌సి, ఎస్‌టి సెల్ డిఎస్‌పి కందే శ్రీనివాసులు విచారణ చేపట్టారు. సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సాక్షులను విచారించారు. విచారణలో ఫిర్యాదులో పేర్కొన్న విధంగా ముగ్గుళ్ళ గ్రామంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను విఆర్ఒ చిన్న, విఆర్ఎ దుర్గారావు ఆపి వివరాలు అడిగారు. విధుల్లో ఉన్న వారిని పాలడుగుల రాము కులం పేరుతో దూషించి, వారిని నిర్బంధించినట్టు విచారణలో బాధితులు తెలిపారు. విఆర్ఎను కొట్టి, దౌర్జన్యంగా ట్రాక్టర్లు తీసుకుని వెళ్లిపోయినట్టు తెలిపారు. విఆర్ఒ గోసాల చిన్న, విఆర్ఎ మద్దాల దుర్గారావు, తహశీల్దారు సూచనలతో సీతానగరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు శారు. నిందితుడు పాలడుగుల రాముపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసుతో పాటు అక్రమ ఇసుక రవాణాపై కేసు నమోదు చేసిన విషయంలో విచారణకు వచ్చినట్టు డిఎస్‌పి శ్రీనివాసులు తెలిపారు. ఈ విచారణలో సీతానగరం ఎస్ఐ రామకృష్ణ, ఎఎస్ఐ సమర్పణరావు పాల్గొన్నారు.

పంట పొలాలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి-తాళ్లపూడి

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి పంట మినీ కిట్స్ వేయడానికి ఆసక్తిగల రైతుల పంట పొలాలను పరిశీలిస్తున్నామని ఏరువాక కేంద్ర సైంటిస్టులు తెలిపారు. మండలంలోని బల్లిపాడు, వేగేశ్వరపురంలో కొందరు రైతులు ఈ వరి పంట వేయడానికి ఆసక్తి చూపడంతో మంగళవారం ఏరువాక సైంటిస్టులు ఆ పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ అమ్మాజీ మాట్లాడుతూ రైతులకు ఈ రకం పంట పెంపకంపై పలు సూచనలు చేశారు. మరో సైంటిస్ట్ డాక్టర్ హైమజ్యోతి మాట్లాడుతూ మొదటి పంట వరి రెండో పంట స్వీట్ కార్న్ మొక్కజొన్న క్రాసింగ్ సిస్టంలో పంటలు పండించే రైతులు, ఖరీఫ్‌లో ఎంటియు 12:75, ఎంటియు 7029 రకాలను పండించడానికి ఆసక్తి చూపిన రైతుల పొలాలను ఫార్మ్ టెస్టింగ్ కోసం ఎంపిక చేసామని తెలిపారు. ఈ పొలాల పరిశీలన కార్యక్రమంలో వీరి వెంట మండల వ్యవసాయ శాఖ అధికారి రుచిత రైతులు బుద్దాల సురేష్, పెద్దిశెట్టి తాతారావు, వల్లిపల్లి సతీష్, విఎఎలు అసీఫా, పోసమ్మ, ఆనంద్‌ఉన్నారు.

రైతులతో మాట్లాడుతున్న సైంటిస్టులు

సర్టిఫికెట్లను సకాలంలో అందజేయాలి

ప్రజాశక్తి-కడియం

పాఠశాలలు, కళాశాలలు తెరుచుకునే సమయం దగ్గర పడుతున్నందున విద్యార్థులకు కావాల్సిన అన్ని రకాల సర్టిఫికెట్లనూ సకాలంలో అందించేందుకు సచివాలయ ఉద్యోగులు తగు చర్యలు తీసుకోవాలని కడియం ఎంపిడిఒ జి.రాజ్‌మనోజ్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం ఆయన గ్రామ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు త్వరలోనే తెరుచుకోనున్నందున అక్కడ ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు. మే నెల మాదిరిగానే జూన్ నెలలో కూడా పింఛన్ల పంపిణీ జరుగుతుందన్నారు. అకౌంట్‌లో పడని వారికి సంబంధించిన సచివాలయ ఉద్యోగులు ఇంటికి తీసుకెళ్లి పింఛనుదారులకు అందజేయాలని సూచించారు. పోలింగ్ జరిగినప్పటికీ వచ్చేనెల 6 వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నాయకుల విగ్రహాల ముసుగులు తీయకూడదని, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకూడదని దీనిపై నిరంతరం సచివాలయ ఉద్యోగులు పర్యవేక్షిస్తూ ఉండాలని ఆయన సూచించారు. సచివాలయ ఉద్యోగులు యథావిధిగా వారి విధుల్లో పనిచేస్తూ రోజుకు పది సర్వీసులు తక్కువ కాకుండా పనిచేయాలని ఎంపిడిఒ మనోజ్ సూచించారు.

మస్తకానికి మంచి ఆహారం పుస్తకం

ప్రజాశక్తి-కడియం

వేసవి శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

మెదడుకు మంచి ఆహారం పుస్తకమేనని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత చిలుకూరి శ్రీనివాసరావు అన్నారు. కడియం శాఖా గ్రంథాలయంలో అధికారి ఎస్.శ్రీదేవి నేతృత్వంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాల్లో మంగళవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయానికి పలు పుస్తకాలు బహూకరించారు. పిల్లలకు చక్కటి నీతి కథలు చెప్పి ఆయన మాట్లాడుతూ సజనాత్మకతను పెంచేవి, ఆలోచనలు రేకెత్తించేవి, మనస్తత్వాన్ని ఏర్పరిచేవి గ్రంథ పఠనాలేనని పేర్కొన్నారు. కడియం గ్రంథాలయంలో ప్రతి ఏటా వేసవిజ్ఞానం పేరిట జరుగుతున్న పిల్లల ఆకర్షణీయ కార్యక్రమాలను నిర్వహిస్తున్న గ్రంథాలయ అధికారిని శ్రీ చెళ్లపిళ్ల వేంకట శాస్త్రి కళాసేవా సమితి అధ్యక్షులు అడపా సుబ్రహ్మణ్యం ప్రశంసించారు. బుక్కు కల్చర్ పోయి లుక్కు కల్చర్ వస్తున్న నేటి తరంలో పిల్లలను వేసవిలో గ్రంథాలయాల వైపు మళ్లించే వేసవిజ్ఞాన శిబిరాలు మహోన్నతమైనవని యుటిఎఫ్ నాయకులు ఆకుల వీర్రాజు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుమ్మరపూడి రవిబాబు, కార్మిక నాయకుడు ఎ.అబ్బు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యాన్ని శక్తివంతం చేద్దాం

ప్రజాశక్తి-నల్లజర్ల

యువతులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సిరాజుద్దీన్

అవగాహన కల్పించడం ద్వారా మహిళల ఆరోగ్యాన్ని మరింత శక్తివంతం చేద్దామని నల్లజర్ల ప్రభుత్వాసుపత్రి వైద్యులు డాక్టర్ మహ్మద్ సిరాజ్ ఉద్దీన్ అన్నారు. ప్రపంచ ఋతు పరిశుభ్రత దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం మండలంలోని మారెళ్లమూడిలో ప్రత్యేక ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బహిష్టు అయిన సమయంలో సరైన పరిశుభ్రత పట్ల ఆరోగ్య అవగాహన లేక ఎంతోమంది అనారోగ్యాల పాలవుతున్నారని చెప్పారు. చిన్న వయస్సు వారికి ఈ అవగాహన ఎంతో అవసరమని, పీరియడ్స్ సమయంలో తలనొప్పి, చిరాకు, అలసట తోపాటు పొత్తికడుపులో తిమ్మిర్లు, కడుపునొప్పి వస్తుంటాయన్నారు. పీరియడ్స్ సమయంలో తిమ్మిర్లు ఉంటే బట్టలో వేడి వాటర్ బ్యాగును చుట్టి పొత్తికడుపుపై పెట్టుకోవాలన్నారు. వేడినీటితో స్నానం, వ్యాయామాలు, వాకింగ్ కూడా ఈ సమయంలో ఎంతగానో ఉపకరిస్తాయని చెప్పారు. పిరియడ్స్‌కు సంబంధించి పలు అపోహలు మహిళల్లో ఉన్నాయని, అపోహలు వీడి అవగాహనతో వ్యవహరించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని డాక్టర్ సిరాజ్ ఉద్దీన్ కోరారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ పలివెల ప్రసాదరావు, పిహెచ్ఎన్ రాధాకుమారి, క్షేత్రస్థాయి పర్యవేక్షకులు అన్నమ్మ, ఎఎన్ఎం నాగరాజ్యం, ఎంఎల్‌హెచ్‌పి సాహిత్య, జివివి.ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కడియంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం

ప్రజాశక్తి-కడియం



వైద్య శిబిరంలో సేవలందిస్తున్న సిబ్బంది

మండల కేంద్రమైన కడియం గ్రామం సచివాలయం-3 పరిధిలో మంగళవారం ఆరోగ్య సురక్ష కార్యక్రమం క్యాంప్ ఇన్‌ఛార్జి డాక్టర్ ఎన్.నాగసాయి మౌర్య ఆధ్వర్యంలో జరిగింది. ఈ వైద్య శిబిరంలో 254 మంది పేషెంట్లకు అవసరమైన పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 21 మందికి కంటిపరీక్షలు నిర్వహించారు. ఆరోగ్యశ్రీకి ఒకరిని రిఫరల్ చేశారు. ఈ వైద్య శిబిరంలో ఆంకాలజిస్ట్ డాక్టర్ జి.శ్రీనివాస్, జనరల్ మెడిసిన్ డాక్టర్ అనసూరి ప్రియాంక, రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి ఆప్తాల్మిక్ టెక్నీషియన్ ముస్తాఫా ఖాన్ కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ఘనంగా ఎన్‌టిఆర్ జయంతి

మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు 101వ జయంతి ఉత్సవాలను మంగళవారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

రాజమహేంద్రవరం టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ కంబాలచెరువు వద్ద ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో కాశి నవీన్ కుమార్, రాచపల్లి ప్రసాద్, ఉప్పులూరి జానకిరామయ్య, మళ్ల వెంకటరాజు, సింహాద్రి సతీష్, సింహాద్రి కోటి, రొక్కం సత్యనారాయణ, కొండబాబు, రమణమ్మ, చిలకల వీరమ్మ, ఇంజి శ్యామల పాల్గొన్నారు.



కొవ్వూరులో సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న టిడిపి నాయకులు

నల్లజర్లలో పార్టీ కార్యాలయం వద్ద టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గోపాలపురం నియోజకవర్గ అభ్యర్థి మద్దిపాటి వెంకటరాజు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో భారీ కేక్ కట్ చేసి వేడుకలు ఘనంగా నిత్వహించారు. ఈ కార్యక్రమంలో ఆంద్రు అనిల్, రంగలి సత్యనారాయణ, లంక సత్యనారాయణ, జమ్ముల వీర వెంకట సతీష్, పసుమర్తి సతీష్, యలమాటి శ్రీనివాసరావు, యద్దనపూడి బ్రహ్మారాజు, కండెపు వెంకటరత్నం, నిమ్మలపూడి ప్రసాద్ పాల్గొన్నారు.

పెరవలి తీపర్రు, పెరవలి, ముక్కామల, ముక్కామల, ఖండవల్లి, కానూరులో ఎన్‌టిఆర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెరవలి మెయిన్ రోడ్డులోని ఎన్‌టిఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సలాది కష్ణమూర్తి, రవి వర్మ, అతికాల రామకష్ణమ్మ, బొడ్డు రామాంజనేయులు, అబ్బిశెట్టి సత్తిరాజు, సలాది శ్రీహరి, నల్లాకుల వెంకటేశ్వరరావు, బండారు సాయి, మాణిక్ రెడ్డి, మురళీకష్ణ పాల్గొన్నారు

ఉండ్రాజవరం వేలివెన్నులో నిడదవోలు మాజీ ఎంఎల్ఎ బూరుగుపల్లి శేషారావు ఇంటి వద్ద ఎన్‌టిఆర్ విగ్రహానికి సర్పంచ్ అత్తిలి సత్యనారాయణ, ఉప సర్పంచ్ బూరుగుపల్లి శ్రీనివాసు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సూర్యారావుపాలెం ఉపసర్పంచ్ నందిన శ్రీనివాస్, కుడప రమేష్, ఈడుపుగంటి పాండురంగారావు, గారపాటి సత్యనారాయణ, కరుటూరి నరేంద్రబాబు పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు.

మండపేట ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అందరికీ స్వీట్లు పంపిణీ చేశారు.

తాళ్లపూడి నామన పరమేశ్వరరావు ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అన్నదాతల కొఠారు వెంకట్రావు, పెద్దేవంలో తిగిరిపల్లి గోపి, పోచవరంలో సీనియర్ టిడిపి నాయకులు అనపర్తి పరమేశ్వరరావు పాల్గొన్నారు.

కొవ్వూరు రూరల్ టిడిపి ఆధ్వర్యాన పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కొవ్వూరు పట్టణంలో ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు రొట్టెలు పంపిణీ చేశారు. ఎంఎల్ఎ అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. విజయ విహార్ సెంటర్లో, బస్టాండ్ సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు దాయన రామకష్ణ, జెవిఎస్ చౌదరి, కంటమణి రామకృష్ణ, సూరపనేని చిన్ని, పొట్రు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరంలో ఎన్‌టిఆర్‌కు నివాళులర్పిస్తున్న గన్ని కృష్ణ, నాయకులు

కడియంలో ఎన్‌టిఆర్‌కు నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

నేరాలు ఘోరాలు

కె.గంగవరంలో మద్యం స్వాధీనం

ప్రజాశక్తి - రామచంద్రపురం

యానాం నుంచి ఏటుగుట్టు రోడ్డుపై కారులో తరలిస్తున్న మద్యాన్ని కె.గంగవరం పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. దంగేరు - వాసాలరేవు మధ్యలో నెల్లూరు జిల్లాకు చెందిన ఐదుగురు యువకులు 16.2 లీటర్ల మద్యం సీసాలను కారులో తరలిస్తుండగా పోలీసులు దాడి చేసి పట్టుకన్నారు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.13,353 ఉంటుందని రామచంద్రపురం సిఐ పి.దొరరాజు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రామచంద్రపురం కోర్టులో హాజరుపర్చామన్నారు. కేసును కె.గంగవరం ఎస్ఐ జానీభాషా దర్యాప్తు చేస్తున్నారని సిఐ తెలిపారు.

రొయ్యల చెరువులో విష ప్రయోగంపై ఫిర్యాదు

ప్రజాశక్తి - కాట్రేనికోన

మండలంలోని కాట్రేనికోన పంచాయతీ శివారు గచ్చకాయల పొర గ్రామంలో రొయ్యలు చెరువులో గుర్తు తెలియని వ్యక్తి విషం కలపడంతో రొయ్యలు మృత్యువాత పడ్డాయని రైతు బొమ్మిడి బాలారాజు పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశాడు. బాలరాజు ఎకరం చెరువులో వనామీ రొయ్యుల సాగు చేపట్టాడు. ప్రస్తుతం రొయ్యలు 100 కౌంట్‌కు చేరుకున్నాయి. గుర్తుతెలియని వ్యక్తి చెరువులో విషం కలపడంతో మృత్యువాత పడ్డాయి. సుమారు రూ.4 లక్షల నష్టం వాటిల్లిందని బాలరాజు ఫిర్యాదులో పేర్కొన్నాడని ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు.

విద్యుదాఘాతానికి గురై పాడి గేదె మృత్యువాత

ప్రజాశక్తి- గోకవరం

విద్యుదాఘాతానికి గురై పాడి గేదె మృత్యువాత పడింది. గోకవరం గ్రామానికి చెందిన గొర్రెల నాగుకి చెందిన పాడి గేదె గ్రామ శివారులో ఉన్న సరాగుల వారి చెరువులో నీరుతాగింది. కొంతకాలంగా విద్యుత్ తీగలు వేలాడుతున్నాయి. నీరు తాగిన అనంతరం గేదె అక్కడ సంచరిస్తూ వేలాడుతున్న విద్యుత్ తీగలకు తగిలింది. విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృత్యువాత పడింది. గేదె విలువ సుమారు రూ.60వేలు యజమాని నాగు తెలిపారు.

వైద్య ఖర్చుల కోసం రూ.25 వేల సాయం

ప్రజాశక్తి - కాకినాడ

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న నిర్వాహకులు

నగరంలోని 27వ వార్డుకి చెందిన దోనె సాయికిరణ్‌కు చిన్న మెదడులో రక్త ప్రసరణ ఆగి పోయింది. దీంతో తల్లిదండ్రులు అతని మిత్ర బృందం పలు ఆసుపత్రుల్లో వైద్యం కోసం ప్రయత్నాలు చేశారు. ఆఖరికి బెంగళూరులో ఓ ప్రయివేటు ఆసుపత్రిలో అత్యవసరంగా శస్త్ర చికిత్స కోసం చేర్చారు. ఈ నేపథ్యంలోనే ఆ యువకుడి వైద్య ఖర్చుల కోసం చేయూత స్వచ్ఛంద సంస్థ అత్యవసర నిధి నుంచి రూ.25 వేలను సాయంగా అందించింది. ఈ సందర్భంగా చేయూత అధ్యక్ష, కార్యదర్శులు రవికుమార్, అలీంలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కష్టాలలో ఉన్న తమ తోటి వారికి సహాయపడాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత సమాజానికి సేవ చేసే దిశగా ఆలోచన చేయాలని, ఆ సంకల్పం తోనే తమ చేయూత సంస్థ చైతన్య పరుస్తూ అవసరంలో ఉన్న ప్రతీ ఒక్కరికీ తమ వంతు సాయాన్ని అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఆర్థిక కార్యదర్శి చింతా నారాయణమూర్తి, మహిళా సభ్యురాలు ఝాన్సీ, పవన్, రామకృష్ణ, మాధవ్, కార్తీక్ పాల్గొన్నారు.

నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - గండేపల్లి

జూన్ 4న జరిగే కౌంటింగ్ సందర్భంగా నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠినచర్యలు తీసుకుంటామని అడిషనల్ ఎస్ఐ టి.వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం నీలాద్రి రావుపేట గ్రామస్తులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందున ఎటువంటి ర్యాలీలకు అనుమతి లేదన్నారు. ఎక్కువమంది గుమ్ముకూడి ఉండ కూడదని, చట్ట వ్యతిరేక కార్యకలాపాల జోలికి ప్రజలు వెళ్లకూడదన్నారు. వెళ్లిన యెడల వారిపై తీసుకునే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో కేసుల్లో చిక్కుకుంటే ఆ కేసులు జీవితాంతం వెంటాడుతూనే ఉంటాయన్నారు.

బుల్లబ్బాయిరెడ్డి మృతికి పలువురి సంతాపం

ప్రజాశక్తి -యు. కొత్తపల్లి

మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డితో బుల్లబ్బాయిరెడ్డి

సంపర మాజీ ఎంఎల్ఎ అనిశెట్టి బుల్లబ్బాయిరెడ్డి973) మృతికి పలువురు సంతాపం తెలిపారు. ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం యు.కొత్తపల్లి మండలం నాగులపల్లిలో తన స్వగృహంలో మృతి చెందారు. సంపర నియోజకవర్గానికి ఆయన రెండుసార్లు కాంగ్రెస్ ఎంఎల్ఎగా గెలుపొందారు. కాంగ్రెస్ పార్టీలో కీలక బాధ్యతలు పోషించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డికి అత్యంత సన్నిహితునిగా ఉన్నారు. ఆయన హయాంలోనే ఉప్పాడ తీరంలో జియోట్యూబ్ నిర్మాణం జరిగింది. నేటికీ ఈ నిర్మాణమే ఉంది. ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. మండల పరిషత్ కార్యాలయం, తహశీల్దార్ భవన నిర్మాణాలకు కృషి చేశారు. ఎపిఎస్ఆర్‌టిసి రీజినల్ అడ్వయిజరీ కమిటీ ఛైర్మన్‌గానూ ఆయన సేవలందించారు. కొత్తపల్లి మండలంలో పలు విద్యాసంస్థలను సైతం ఆయన నెలకొల్పారు. విభజన అనంతరం ఆయన కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. 2019లో పవన్‌కళ్యాణ్ సమక్షంలో జనసేన తీర్థం పుచ్చుకున్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చే సందర్భంలో ఆయన మృతి పట్ల జనసేన నాయకులు సంతాపం తెలిపారు. కాకినాడ ఎంపీ వంగా గీత ఆయన భౌతికకాయాన్ని సందర్శించి సంతాపం తెలిపారు. అలాగే వైసిపి నాయకులు రావు చిన్నారావు, ఆనాల సుదర్శన్, జ్యోతుల చక్రబ్బాయి, బోరా రమణారెడ్డి, పాత్రికేయులు చోడిశెట్టి సురేష్, చోడిశెట్టి సతీష్, వెలుగుల వరప్రసాద్, ఎం.సూర్యనారాయణమూర్తి తదితరులు సంతాపం తెలిపారు.

నేడు ఉత్తమ విద్యార్థులకు అభినందన సభ

ప్రజాశక్తి - పెద్దాపురం

ఈ ఏడాది 10వ తరగతి పరీక్షల్లో పాఠశాల స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు నేడు చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించనున్నట్లు ఆ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ గౌరవాధ్యక్షులు బుద్దా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగే ఈ సభలో ముఖ్య అతిథులుగా పెద్దాపురం డిఎస్‌పి లతాకుమారి, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు చెలికాని స్టాలిన్, సిఐ రవికుమార్, యుటిఎఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి వర్మ తదితరులు పాల్గొంటారన్నారు.

రికార్డులు లేని వాహనాల స్వాధీనం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం నియోజకవర్గ పరిధిలో మంగళవారం రాత్రి వరకూ నిర్వహించిన నాకాబందిలో అధిక సంఖ్యలో రికార్డులు లేని వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రవికుమార్ తెలిపారు .మంగళవారం రాత్రి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ తనిఖీలు జూన్ 4వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నందున వాహనదారులు మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దన్నారు.సైలెన్సర్లు తీసివేసి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - యానాం

స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయంలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తున్నట్లు ఎఇ లంక కృష్ణారావు తెలిపారు. కేంద్రపాలిత ప్రాంతాలు, గోవా రాష్ట్ర ఉమ్మడి విద్యుత్ నియంత్రణ కమిషన్ ఆధ్వర్యంలో ఈ సమావేశం జరుగుతుందని వెల్లడించారు. విద్యుత్ పంపిణీలో సమస్యలు, పేరు బదిలీ, బిల్లుల జారీ, సవరణ, పనిచేయని మీటర్ల మార్పు, విద్యుత్ అంతరాయం, లోఓల్టేజీ, హైఓల్టేజీ తదితర సమస్యలపై వినియోగదారులు రాతపూర్వకంగా ఫిర్యాదులు చేయవచ్చునని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలు కల్పించాలి

కాకినాడ : స్కూళ్లు తెరిచే సమయానికి సర్కారు బడుల్లో సదుపాయాలు కల్పించాలని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. పాఠ్య పుస్తకాలు, యూనిఫాం అందుబాటులో ఉంచడంతోపాటు, ఆయా పాఠశాలల్లో మరుగుదొడ్లు, నాప్ కిన్స్, సురక్షిత తాగునీటిని అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అడ్మిషన్లకు సంబంధించిన ఫీజుల వివరాలు, సీట్ల సంఖ్యను నోటీస్ బోర్డుల్లో రోజువారీ ప్రకటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. క్రీడా మైదానాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని, మధ్యాహ్న భోజనం చేసేందుకు వీలుగా అన్ని పాఠశాలల్లో దాతల ద్వారా లంచ్ షెల్టర్ల, సైకిల్ షెల్టర్స్ నిర్మాణం చేపట్టాలని కోరారు.

నేడు గర్భిణులకు బియ్యం పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతీ బుధవారం ప్రత్యేక ఆరోగ్య పరీక్షలకు హాజరయ్యే గర్భిణీలకు అన్నదాన కార్యక్రమానికి అవసరమయ్యే బియ్యాన్ని పంపిణీ చేయనున్నట్లు మన పెద్దాపురం ఫేస్‌బుక్ అడ్మిన్ పెదిరెడ్డి నరేష్ తెలిపారు. మంగళవారం పాశీల వారి వీధిలోని లైఫ్ కేర్ కేంద్రం వద్ద సంస్థ యాజమాన్య ప్రతినిధులు వి.శ్రీనాథ్, జి.సతీష్ చేతుల మీదుగా నెల రోజులకు సరిపడే బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో మన పెద్దాపురం గ్రూప్ సభ్యులు నెక్కల భుజంగరావు, మార్ని శివ, సత్య ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్ చికిత్సపై అవగాహన

ప్రజాశక్తి-అమలాపురం

క్యాన్సర్ వ్యాధిని గుర్తింపు, చికిత్స తదితర అంశాలపై రంగరాయ మెడికల్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన వైద్య అధికారులు హాజరై అవగాహన పొందారని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.దుర్గారావు దొర మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కమిషనర్ కుటుంబ సంక్షేమ శాఖ ఆదేశాల అనుసారం అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని రంగరాయ మెడికల్ కళాశాల నందు క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ చికిత్సలపై అవగాహన సదస్సు కార్యక్రమంలో భాగంగా రంగరాయ మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో ఎపి వైద్య విధాన పరిషత్ సంబంధించిన గైనకాలజిస్టులు, డెంటల్ డాక్టర్లకు క్యాన్సర్‌పై మూడు రోజుల పాటు వివిధ ప్రొఫెసర్లు రేడియాలజిస్ట్ డెంటల్ ఆంకా లజిస్టుల ట్రైనింగ్ నిర్వహించారన్నారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.రుక్మిణి దేవి, డాక్టర్ హేమలత, ఎన్‌సిడి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జాన్‌లివి, అకౌంట్ ఆఫీసర్ వెంకట శ్రీను, ఎన్సీడి తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి-మామిడికుదురు

లూటుకుర్రు పిహెచ్‌సి వైద్యాధికారి లావణ్య ఆధ్వర్యంలో మంగళవారం పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ ఉమామహేశ్వరరావు ఏఎన్ఎం శాంతకుమారి,గంగ భవాని,ఆశ వర్కర్స్ కమలావతి తదితరులు పాల్గొన్నారు.

కవ్వింపు చర్యలకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

వచ్చే నెల 4న కౌంటింగ్ సందర్భంగా ఎటువంటి కవింపు చర్యలకు పాల్పడినా, బాణాసంచ కాల్చినా, ఎక్కువ జనం గుమిగూడినా 144 సెక్షన్, 30 అమలులో ఉన్నందున వారిపై చర్యలు తీసుకుంటా మని ఎస్ఐ ఎస్.శ్రీనివాస్ హెచ్చరించారు మంగళవారం ఆయన ఉచ్చిలి గ్రామంలో ఆయన ఎటువంటి గొడవలు జరగకుండా ముందస్తుగా హెచ్చరించి గ్రామ పెద్దలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఆంగ్ల పరీక్షకు 826 మంది హాజరు

ప్రజాశక్తి-ముమ్మిడివరం

పదవ తరగతి సప్లమెంటరీ ఆంగ్ల పరీక్షకు సంబంధించి జిల్లాలో1594 మంది విద్యార్థుల హాజరు కావలసి ఉండగా 826 మంది విద్యార్థుల పరీక్షలకు హాజరైనట్లు మంగళవారం డిఇఒ ఎం.కమల కుమారి తెలిపారు. జిల్లాలో వీరి కోసం 16 సెంటర్లు ఏర్పాటు చేయగా 826 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 768 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని, ఫ్లయింగ్ స్క్వాడ్ 4 పరీక్ష కేంద్రాల్లో తనిఖీలు చేయగా డిఇఒ ఎం.కమల కుమారి 3, పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ ఎం.సురేష్ 3 పరీక్ష కేంద్రాల్లోనూ తనిఖీలు నిర్వహించారు. కాగా ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని జెడ్‌పి బాలికోన్నత పాఠశాల కేంద్రంలో 60 మందికి కేవలం 10 మంది హాజరు కాగా 50 మంది గైర్హాజరయ్యారని ఎంఇఒ బి.రమణశ్రీ తెలిపారు.

విద్యార్థులకు రుచికరమైన ఆహారం ఇవ్వాలి

ప్రజాశక్తి-పెరవలి

సమావేశంలో పాల్గొన్న ఎంఇఒ వెంకటరాజు

మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రుచికాయ రుచికరమైన ఆహారం నాణ్యతతో రుచితో తయారు చేయాలని ఎంఎఒ డి.వెంకట్ రాజు అన్నారు. మధ్యాహ్న భోజనం తయారీ కార్మికులకు సోమవారం పెరవలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఒకరోజు శిక్షణా కార్యక్రమం ఎంఇఒ షేక్ సూర్జహాన్ అధ్యక్షతన నిర్వహించారు. పాఠశాల విద్యార్థులకు మెనూ ప్రకారం మరింత మెలకువలతో రుచికరమైన ఆహారం అందించాలని ఆయన ఆకాంక్షించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు మధ్యాహ్న భోజనం తయారీ కార్మికుల పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన వంటల పోటీల్లో అజ్జరం నెం-1 పాఠశాల ప్రథమ స్థానం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఖండవల్లి ద్వితీయ స్థానం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాకరపర్రు మూడవ స్థానం గవర్నమెంట్ ఉన్నత పాఠశాల తృతీయ స్థానం బహుమతులు పొందారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు బిఎస్ఎస్.స్వరూప్, హెచ్ఎంలు ప్రసాదరావు, ఉపాధ్యాయులు నాగార్జున, మహేష్ పాల్గొన్నారు.

వాహన తనిఖీల్లో పోలీసులు

పోలీసులపై వాహనదారుల అసహనం

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ నగరంలో పోలీసులు వ్యవహరిస్తున్న తీరు పట్ల ద్విచక్ర వాహనదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు తీరును నిరసిస్తూ మంగళవారం జిల్లా కలెక్టర్ జె.నివాస్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం కాకినాడ ప్రాంతంలో ద్విచక్ర వాహనదారుల వాహనాలను పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు వ్యవహరించిన తీరు, దౌర్జన్యంపై మంగళవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తమను కావాలనే ఇబ్బందులు గురి చేస్తున్నారని, అన్ని ధ్రువపత్రాలుఉన్నా ఏదో ఒక సాకుతో అనవసరన పత్రాలు అడిగి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. తాము రోజువారి కూలి పనులు చేసుకుంటూ వెళుతుంటే వాహనాలను బలవంతంగా లాక్కొని కాకినాడలోని కలెక్టరేట్ వెనుక ఉన్న డిఎస్‌పి కార్యాలయంలో ఉంచారని తెలిపారు. ఈ విషయాన్ని సోమవారం రాత్రి అడిగితే మంగళవారం ఉదయం 10 గంటలకు డిఎస్‌పి కార్యాలయానికి రావాలని వాహనాలు ఇచ్చేస్తామని చెప్పడంతో తాము ఇళ్లకు వెళ్లిపోయామన్నారు. తిరిగి మంగళవారం ఉదయం వచ్చి అడిగితే పోలీసులు సంబంధం లేని సమాధానాలు చెప్పడమే కాక కొందరిపై దౌర్జన్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై అక్కడ ఉన్న పోలీసులను అడగగా అన్ని తనిఖీలు నిర్వహిస్తున్నామని పత్రాలు లేని వాహనాలు ఆపుతున్నామన్నారు. అలాగే రెండు రోజులలో జిల్లా ఉన్నతాధికారులతో వీరికి పోలీసులు నిబంధనలపై వివరిస్తామన్నారు. అంతవరకు వారు ఎటువంటి ఇబ్బందులు పడవద్దని ఎవరి వాహనాలను వారికే ఇచ్చివేస్తామని పోలీసులు చెప్పారు.

ఆరోగ్య సమస్యలపై అవగాహన

ప్రజాశక్తి-తాళ్లపూడి

యుక్త వయసులో ఉన్న ప్రతి కిషోర్ బాలికలు శరీరంలో వచ్చే మార్పులు గమనిస్తూ ఆహారం ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకుంటూ చెడు ప్రవర్తన గల వ్యక్తులకు దూరంగా ఉండాలని మలకపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ అన్నపూర్ణ అన్నారు. యుక్త వయసు వచ్చిన బాలికలు తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేస్తూ మంగళవారం మలకపల్లిలో ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరితో స్నేహపూర్వకంగా ఉండాలని అంటూ ఐరన్ మాత్రల వాడకం శానిటరీ వినియోగంపై బాలికల తల్లులకు కూడా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చందన ఎఎన్ఎం నాగపూర్ణావతి పాల్గొన్నారు.

ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష

ప్రజాశక్తి-పెరవలి

మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ హిమమహేశ్వరి ఆధ్వర్యంలో మంగళవారం ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లతో సమాక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లేబర్ టార్గెట్ ప్రకారం పెంచమని ప్రస్తుతం 1400 పని దినాలు కల్పిస్తున్నామని ఇంకా పెంచమని ఆదేశించారు. ఎస్సి ఎంప్లాయ్‌మెంట్ ప్రస్తుతం 46 ఉన్నందున పెంచాలని ఆదేశించారు. ప్రతి రోజూ ఎఫ్ఎలు, ఎంఎస్ యాప్‌లో సకాలంలో 9 గంటల్లోపు నమోదు చేయాలని ఆమె ఆదేశించారు. ప్రతి టాస్క్ 100 పూర్తి చేయాలని వర్క్ నిర్లక్ష్యం వహిస్తే తగు చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు ఈ కార్యక్రమంలో టిఎస్.శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్ ఎపిఒ ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పూడికతీత పనులను పరిశీలించిన కమిషనర్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నగరంలో మేజర్, మైనర్ కాలువల్లో పూడికతీత పనులను వేగంగా నిర్వహించి ముంపు సమస్య రాకుండా చూడాలని కమిషనర్ అధికారులు, సిబ్బందిని ఆదేశించినారు. డీసిల్టేషన్ పనులను ట్రైనీ కలెక్టరు భావనతో కలిసి ఆయన మంగళవారం పరిశీలించారు. జడ్జి బంగ్లా వాటర్ ట్యాంకుల వద్ద ఉన్న 25వ క్లస్టర్ మస్తర్ ఆఫీసును ఉదయం 5గంటలకు పరిశీలించారు. మస్తరు నిర్వహణ, పారిశుధ్య కార్మికుల హాజరును పరిశీలించారు. ఉదయం 6 గంటకే పారిశుధ్య కార్మికులు పనులను ప్రారంభించాలన్నారు. అనంతరం వెహికల్ యార్డుకు వెళ్లి పారిశుధ్య వాహనాల రికార్డులను, డ్రైవరు మస్తర్లను పరిశీలించారు. అనంతరం 10వ డివిజన్ ఎల్ఐసి కార్యాలయం వద్ద ఉన్న గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ పాయింట్(సెకండరీ)ను పరిశీలించారు. పలు సూచనలు చేశారు. 14వ డివిజన్‌లో రోడ్డు స్వీపింగ్, డ్రైన్ క్లీనింగ్, దోమల మందు స్ప్రేయింగ్, ఇంటింటా చెత్త సేకరణ అంశాలను పరిశీలించారు. 28వ డివిజనులో మేజర్ డ్రెయిన్, రాతి చానల్‌లో యంత్రాల ద్వారా నిర్వహిస్తున్న డిసిల్టేషన్ పనులను, హిందూ సమాజం వీధి, డీలక్స్ సెంటర్, స్టేడియం రోడ్‌లోని డీసిల్టింగ్ పనులను ఆయన పరిశీలించారు. నైరుతి రుతుపవనాల ప్రభావంతో జూన్ నెల మొదటి వారం నుంచి వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఈ నెల 31లోగా పూడికతీత పనులను పూర్తి చేయాలన్నారు.

తూతూ మంత్రంగా మండల సమావేశం

ప్రజాశక్తి-కాట్రేనికోన

మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం మంగళవారం వైస్ ఎంపిపి ఎస్.నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో ఎటువంటి రివ్యూ నిర్వహించడానికి అవకాశం లేదని ఎంపిడిఒ శ్రీదేవి సమావేశంలో తెలియజేయడం ఎటువంటి చర్చ లేకుండా సమావేశం నిర్వహించారు. వేసవి కావడంతతో తాగునీటి సమస్యలు ఉంటే తెలపాలని సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులకు తెలియజేశారు. తాగునీటి అంశంపై ఆర్‌డబ్ల్యూఎస్ జెఇ సుబ్రహ్మణ్యం సమావేశంలో సభ్యులకు తెలియజేశారు. మండలంలో విద్యుత్ మోటర్ల సమస్యలు ఉన్నాయని, వాటిని నియంత్రణ చేయనిదే ఎన్ని రూ.కోట్లు ఖర్చు చేసిన తాగు నీరు సమస్యలు పరిష్కారం కావని, అందుజేత విద్యుత్ మోటర్ల తొలగింపుకు అధికారులకు ప్రజా ప్రతినిధులు సహకారం అందించాలని కోరారు. అనంతరం సమావేశాన్ని ముగించారు. కార్యక్రమం లో సర్పంచ్లు, ఎంపీటీసీ లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 94432
కాకినాడ, కోనసీమ జిల్లాల సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99189

అగ్రహారంలో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-రామచంద్రపురం

అంబికపల్లి అగ్రహారం లో మంగళవారం పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎన్నికల కౌంటింగ్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో పలు గ్రామాలలో తనిఖీలు నిర్వహించి సరైన పత్రాలు లేని వాహనాలు స్వాధీనం చేసుకుంటున్నారు. మంగళవారం తనిఖీల్లో 9 మోటార్ సైకిల్ సరైన పత్రాలు లేని వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సిఐ దొరరాజు, ఎస్సై సురేష్ బాబు గ్రామస్తులతో మాట్లాడి శాంతిభద్రతలకు బంగారం కలిగించరాదని, గ్రామంలో కొత్తగా వచ్చిన వారి వివరాలు తెలియజేయలన్నారు.

జర్నలిజం పట్ల ఆసక్తి, సామాజికస్పృహ ఉన్నాయా?
విన్నదీ కన్నదీ పది మందితో పంచుకుందామనుకుంటున్నారా?
ప్రజాశక్తి
మీరు జర్నలిస్టు కాదలచుకున్నారా!
దినపత్రికలో పనిచేసేందుకు
క్రింది తెలిపిన కేంద్రాల్లో విలేకర్లు కావలెను
రాజమండ్రి, రాజమండ్రి సిటీ
రాజమండ్రి క్రైం, రంగంపేట, అనపర్తి
రాయవరం, పి.గన్నవరం
రావులపాలెం, అల్లవరం, కోరుకొండ
మలికిపురం, సఖినేటిపల్లి, మండపేట
కె.గంగవరం, కాకినాడ సిటీ, కాకినాడ క్రైం
గొల్లప్రోలు, తుని, తుని రూరల్
తొండంగి, ప్రత్తిపాడు
విలేకరులు కావలెను
విలేకర్లకు అర్హత: ఇంటర్ ఉత్తీర్ణత, జర్నలిజం పట్ల ఆసక్తి, సమస్యల పట్ల అవగాహన
ఇంటర్వ్యూ జరుగు తేదీ: ది.30-05-2024 గురువారం ఉదయం 10 గంటలకు
::స్థలం:: ప్రజాశక్తి కార్యాలయం, ఇండస్ట్రియల్ ఎస్టేట్, స్వరూప్‌నగర్ లాలాచెరువు, రాజమండ్రి
సంప్రదించాల్సిన నెంబర్లు
92918 01804, 94900 99169

కౌంటింగ్ రోజు పల్లెల్లో ప్రత్యేక నిఘా

ప్రజాశక్తి-రామచంద్రపురం

మాట్లాడుతున్న సిఐ దొరరాజు, ఎస్ఐ జానీ బాషా

జూన్ 4న ఎన్నికలు కౌంటింగ్ రోజు పల్లెల్లోనూ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, అన్ని గ్రామాల్లోనూ మొబైల్ టీం సిద్ధం చేశామని రామచంద్రపురం సిఐ పి.దొరరాజు తెలిపారు. ఆయన మంగళవారం కె.గంగవరం పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల కోడ్ జూన్ 6 వరకు అమల్లో ఉంటుందన్నారు. అదేవిధంగా వన్ పార్టీ 144 సెక్షన్, 30 అమలులో ఉంటాయని సిఐ వివరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించవద్దని,గుంపులుగా జనం గుమి కూడ రాదని, అదేవిధంగా ఊరేగింపులు, బాణసంచా కాల్చడం వంటివి నిషేధించామన్నారు. ఇవన్నీ జూన్ 6 వరకు అమల్లో ఉంటాయి అన్నారు. అదేవిధంగా జూన్4న మద్యం షాపులు పూర్తిగా మూసివేయాలని ఆదేశించామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. ఇప్పటికే సమస్య ఆత్మక గ్రామాలు గుర్తించమని అక్కడ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటివరకు పాత నేరస్తులను బైండోవర్ చేశామని, అదేవిధంగా నియోజకవర్గంలో గల రౌడీ షీటర్లకు ప్రత్యేక కౌన్సిలింగ్ ఇచ్చామని కౌంటింగ్ రోజు వారు ఎవరు బయటకు రావద్దని, అదేవిధంగా సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పైన ప్రత్యేకంగా ఉంచామన్నారు. దీంతో పాటుగా కిళ్లీ షాపుల వద్ద పెట్రోలు లూజ్ అమ్మకాలు విక్రయించరాదని ఆదేశాలు జారీ చేశామని నిబంధనలను అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. దీంతోపాటుగా మోటార్ సైకిళ్లకు సైలెన్సర్లు తీసి నడపడం నేరమన్నారు. అటువంటివారు వివరాలు తెలియజేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. అదేవిధంగా గ్రామాల్లో కొత్తగా వచ్చి ఎన్నికలు పై ప్రభావం చూపే వారి పైన దృష్టి సారించామని, గ్రామాల్లోనూ పట్నంలోనూ ఎవరైనా కొత్తగా వస్తే వారి వివరాలు పోలీసులకు తెలియజేయాలని సిఐ సూచించారు.. కేంద్ర బలగాలు శాంతిభద్రతల దృష్ట్యా ఆరో తేదీ వరకు ఇక్కడే ఉంటాయని, వారి ద్వారా గ్రామాల్లో అల్లర్లు జరగకుండా చర్యలు తీసుకునేందుకు మొబైల్ టీవీ కూడా ఏర్పాటు చేసి నిరంతరం ఆయా గ్రామాల్లో తనిఖీలు చేస్తారని, ఈ విషయాలను దష్టిలో ఉంచుకొని ఏ విధమైన అసాంఘిక కార్యక్రమాలకు శాంతిభద్రతలకు ఎవరూ విఘాతం కలిగించవద్దని సిఐ దొరరాజు విజ్ఞప్తి చేశారు. విలేకరుల సమావేశంలో కె.గంగవరం ఎస్ఐ జానీ బాషా, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పలుచోట్ల వేసవి శిక్షణ శిబిరాలు

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలోని శాఖా గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాలు మంగళవారం కూడా కొనసాగాయి.

అమలాపురం: వేసవిలో సెలవుల్లో విద్యార్థులు గ్రంథాలయాలకు విచ్చేసి వేసవి శిక్షణ శిబిరాలను వినియోగించుకోవాలని, క్రమశిక్షణ అలవర్చుకోవాలని గ్రంథాలయ అధికారి పరమట సత్యనారాయణ అన్నారు.మంగళవారం గోడి శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా నీతి కథలు సమయస్ఫూర్తి తో కూడిన ఆటలను నేర్పించారు. ప్రతి విద్యార్థి గ్రంథాలయాలకు వచ్చి పుస్తకపఠనం అలవర్చుకోవాలని గ్రంథాలయ అధికారి సత్యనారాయణ విద్యార్థులను కోరారు. 28 %ఖఎజూ% 5 వేసవి శిక్షణ తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులు **మామిడికుదురు :** శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా మంగళవారం విద్యార్థులకు చదరంగం పై అవగాహన కల్పించి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల వల్ల మోస్సు పెరుగుతుందని గ్రంథాలయ నిర్వహకులు సూర్యనారాయణ అన్నారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అమలాదాసు, బీడీసి వై.కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

బాల బాలాజీ హుండీల ఆదాయం రూ.32.78లక్షలు

ప్రజాశక్తి-మామిడికుదురు

అప్పనపల్లి బాల బాలాజీ స్వామి హుం డీల లెక్కింపు అమలాపురం జిల్లా దేవదాయ సహాయ కమిషనర్ దూనబోయిన నాగ మల్లీశ్వరరావు పర్యవేక్షణలో మంగళవారం నిర్వహించారు. 62 రోజు లకు రూ.31,46,808, అన్నదానం హుండీ ద్వారా రూ.1,31,740 వెరశి మొత్తం ఆదాయం రూ .32,78,548 లభించింది. బంగారం 32 గ్రాములు, వెండి 140 గ్రాములు. వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్ గ్రంధి మాధవి తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది, సేవా సంఘం సభ్యులు,నాయీబ్రహ్మణులు పాల్గొన్నారన్నారు.

ప్రకటన

నా క్లయింటు అయిన **ది ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, రాజమహేంద్రవరం మెయిన్ బ్రాంచ్ బ్యాంక్** దగ్గరకి, తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం పట్టణ మేదరుపేట, డోరు నెం. 43-9-33 కాపురస్తులు **గ్రంధి అప్పారావు గారి భార్య గ్రంధి వరలక్ష్మి** వచ్చి నా క్లయింటు బ్యాంకులో వారి ఆస్తి అనగా రాజమహేంద్రవరం మేదరు పేట, డోరు నెం. 43-9-33/1 గల ఇంటి హామీపై రుణము కోరుతూ ఆదిలో ఈ ఆస్తి తన మామగారు, అత్తగారు అయిన గ్రంధి అప్పలస్వామి, గ్రంధి పర్వతమ్మ గార్లదనీ, వారికి ది. 27-5-1982న రాయబడి రాజమహేంద్రవరం సబ్‌రిజిస్ట్రార్ వారి ఆఫీసులో 1వ పుస్తకము 1538 వాల్యూమ్ 75ల 78 పుటలలో 1982 సం॥రం నెం. 3616 రుగా నమోదు అయిన క్రయ దస్తావేజు దఖలు పడినదనీ దర్మిలా వారు ఇరువురు కలిసి ది. 18-8-1995 సం॥రం తేదీన అన్-రిజిస్టరు వీలునామా రాయించి వారి ఏకైక కుమారుడు అయిన తన భర్త గారు అయిన గ్రంధి అప్పారావు గారికి దఖలుపరిచి దర్మిలా మరణించినారనీ, దర్మిలా తన భర్త గారు తనకు పైన ఇంటిని **ది. 21-10-2023న రాయించి డాక్యుమెంట్ నెం. 12114/2023** గా రాజమహేంద్రవరం జాయింటు సబ్ రిజిస్ట్రార్ వారి ఆఫీసులో నమోదు అయిన శెటిల్మెంటు దస్తావేజు ద్వారా దఖలు పరిచినారు. తన భర్త గారు ఆ విధముగా దఖలు పరిచే సందర్భములో పైన పేర్కొన్న ఒరిజినలు దస్తావేజు అనగా ది. 27-5-1982 న రాయబడి రాజమహేంద్రవరం సబ్ రిజిస్ట్రార్ వారి ఆఫీసులో 1వ పుస్తకము 1538 వాల్యూమ్ 75ల 78 పుటలలో 1982 సం॥రం నెం. 3616 రుగా నమోదు అయిన ఒరిజినలు క్రయ దస్తావేజు తన దగ్గర పోయినదనీ తెలియజేస్తూ దానికి సంబంధించిన నకలు ఇచ్చినారనీ తెలియచేసినారు. అందువలన సదరు ఒరిజినలు దస్తావేజు అనగా ది. 27-5-1982న రాయబడి రాజమహేంద్రవరం సబ్‌రిజిస్ట్రార్ వారి ఆఫీసులో 1వ పుస్తకము 1538 వాల్యూమ్ 75ల 78 పుటలలో 1982 సం॥రం నెం. 3616 రుగా నమోదు అయిన ఒరిజినల్ క్రయ దస్తావేజు ఎవరి దగ్గరైనా ఉన్ననూ వారికి సదరు దస్తావేజు ఆస్తి మీద హక్కు ఉన్ననూ, ఈ ప్రకటన వెలువడిన రోజు నుంచి ఒక వారములోగా పై బ్యాంక్ వారికి గాని, ఈ దిగువ పేర్కొన్న లాయరు గారికి గాని తగిన ఆధారములతో తెలియచేయవలెను. లేనిచో పైన పేర్కొన్న గ్రంధి వరలక్ష్మి గారికి నా క్లయింటు బ్యాంకుచే రుణము మంజూరు చేయబడును. దర్మిలా వచ్చిన అభ్యంతరములు నా క్లయింటును బైండు చేయదని ఇందుమూలముగా యావన్మందికి తెలియచేయడమైనది.

పి.సూర్యనారాయణమూర్తి
రాజమహేంద్రవరం బ్యాంక్ తరపు అడ్వకేట్
28-5-2024 సెల్: 9885665808